ముగిసిన సార్వత్రిక ఎన్నికలు

- కొన్ని కేంద్రాల్లో రాత్రి వరకు కొనసాగింపు
- బాపట్లలో 72 శాతానికి పైగా పోలింగ్


బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో బారులు తీరిన ఓటర్లు

బాపట్ల: సాధారణ ఎన్నికలు ఒకటి, రెండు చోట్ల మినహా బాపట్ల నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7గంటలకే క్యూ లైన్లలో ఓటర్లు నిండిపోయారు. ఎండలను సైతం లెక్క చేయకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు.బాపట్ల మండలంలోని చెరువు జమ్ములపాలెం గ్రామంలో రాత్రి 9 గంటల వరకు ఓటింగ్ కొనసాగింది. మున్సిపల్ హైస్కూలులో భారీగా ఓటర్లు బారులు తీరారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా మున్సిపల్ హైస్కూలులో ఓటు హక్కును వినియోగించుకోగా, ఎస్పీ వకుల్‌జిందాల్ ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. బాపట్ల వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఎమ్మెల్యే కోన రఘుపతి యాదవపాలెంలోని పోలింగ్ బూత్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

72శాతం పోలింగ్ నమోదు

బాపట్ల నియోజకవర్గంలో మొత్తం 1,90,925 మంది ఓట్లు ఉండగా సాయంత్రం ఐదు గంటలకు 1,36,511 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 72 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 9 గంటలకు 22,147మంది ఓటు హక్కును వినియోగించుకోగా 11.6శాతం నమోదైంది. 11 గంటలకు 50,671మంది ఓటు హక్కు వినియోగించుకోగా 26.54శాతం నమోదైంది. మధ్యాహ్నం 1గంటకు 83,091మంది ఓటు హక్కు ఉపయోగించుకోగా 43.52 శాతం, మూడు గంటలకు 1,11,347మంది ఓటు హక్కు ఉపయోగించుకోగా 58.32 శాతం, సాయంత్రం 5గంటలకు 72శాతం నమోదైంది.

ఇంజినీరింగ్ కళాశాలలో రిసెప్షన్ సెంటర్ పరిశీలన

బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్‌ను జిల్లా ఎన్నికల పరిశీలకులు పరిమళసింగ్, జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా పరిశీలించారు. స్ట్రాంగ్ రూములను పరిశీలించారు.

నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు ఇలా

రేపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 14 మంది ఎన్నికల బరిలో నిలబడగా వీరిలో గుర్తింపు పొందిన పార్టీల నుంచి 11 మంది, స్వతంత్ర అభ్యర్థులుగా ముగ్గురు ఎన్నికల బరిలో పోటీపడ్డారు. రేపల్లె మున్సిపాలిటీతో పాటు రేపల్లె రూరల్, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాలతో కూడిన రేపల్లె నియోజకవర్గంలో 2,27,232 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,11,071 మంది పురుషులు, 1,15,979 మంది మహిళలు, 13 మంది ఇతరులు ఉన్నారు.

పోలింగ్ ప్రక్రియ జరిగిందిలా..

సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఉదయం 9 గంటలకు 25,664 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 10.95 శాతం పోలింగ్ నమోదయ్యింది. 11 గంటలకు 60,618 మంది ఓటు వినియోగించుకోగా 26.68 శాతం, మధ్యాహ్నం 1 గంటకు 1,01,310 మంది ఓటు వినియోగించుకోగా 44.58 శాతం, 3 గంటలకు 1,34,965 మంది ఓటు వినియోగించుకోగా 59.40 శాతం, సాయంత్రం 6 గంటలకు1,68,469 మంది ఓటు వినియోగించుకోగా 74.14 శాతం ఓటింగ్ నమోదయ్యింది. అయితే ఆరు గంటల తరువాత పలు కేంద్రాలలో ఓటర్లు క్యూలైన్‌లలో వేచి ఉండటంతో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు అవకాశం కల్పించారు. మండలంలోని లక్ష్మీపురం, పెనుమూడి, మున్సిపల్ హైస్కూలు, అయోవా బాలికోన్నత పాఠశాలలోని కేంద్రాలలో 6 గంటల తరువాత సైతం పోలింగ్ కొనసాగింది.

బారుల తీరిన ఓటర్లు

వేమూరు: సార్వత్రిక ఎన్నికలకు ఓట్లు వేసేందుకు మహిళలు, పురుషులు క్యూలో బారులు తీరారు. సోమవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభించారు. ఎండ తీవ్రత ఉండటం వల్ల మహిళలు, పురుషులు ఓట్లు వేసేందుకు ఉదయం నుంచే బారులు తీరారు. వర్షం వల్ల పోలింగ్‌కు అంతరాయం కలిగింది.

నియోజకవర్గంలో పోలింగ్ 77 శాతం

వేమూరు: నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ 77.62 శాతం పోలైనట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి వసంత రాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు 26.94 శాతం, మధ్యాహ్న 1 గంటకు 44.22 శాతం, 3 గంటలకు 59.69 శాతం, 5 గంటలకు 75.16 శాతం, 6 గంటలకు 77.62 శాతం పోలైనట్లు ఆయన తెలిపారు.


పోలింగ్ బూత్ వద్దకు దివ్యాంగ ఓటర్లను తీసుకువస్తున్న కుటుంబ సభ్యులు


రేపల్లె పట్టణం ఓల్డ్‌టౌన్‌లోని మున్సిపల్ హైస్కూలు పోలింగ్ బూత్‌లో ఓటర్లు


రేపల్లెలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రానికి వస్తున్న వృద్ధురాలు

రేపల్లెలో ముగిసిన పోలింగ్


రేపల్లె ఓల్డ్‌టౌన్‌లోని పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు

రేపల్లె రూరల్: సార్వత్రిక ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. అక్కడక్కడ చిన్నపాటి ఘర్షణలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగియటంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉదయం 6 గంటల నుంచి పోలింగ్ బూత్‌ల వద్దకు చేరుకున్నారు. ఉదయం నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపినప్పటికీ తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రజలు ముఖ్యంగా వృద్ధులు, నూతనంగా ఓటు హక్కు పొందిన యువత పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చారు. మధ్యాహ్నం ఎండ కాస్తంత ఎక్కువగా ఉండటంతో పలుచోట్ల కాస్తంత ఓటింగ్ నిదానంగా సాగింది. రేపల్లె పట్టణంలోని అన్ని బూత్‌లలో పోలింగ్ రద్దీ ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగింది. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో కొద్దిసేపు వర్షం పడినప్పటికీ ఓటర్లను అంతగా ప్రభావం చేయలేదు. వర్షం నిలిచిపోయి కాస్తంత వేడిమి తగ్గటంతో సాయంత్రం 3.30 గంటల నుంచి 6 గంటల వరకు పోలింగ్ బూత్‌లలో ఓటర్లు తమ హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు. ఎన్నికల్లో కీలమైన పోలింగ్ పక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో ముందుకు సాగినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి హెలా షారోన్ తెలిపారు. నిరంతరం ఎన్నికల బూత్‌లను పరిశీలిస్తూ అధికారులు, సిబ్బందిని సమన్వయం చేస్తూ ఎన్నికల నిర్వాహణలో ఎటువంటి అవాంతరాలు చోటు చేసుకోకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నట్లు ఆమె తెలిపారు.

పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ కవ్వింపు చర్యలు


ఈపూరులో టీడీపీ, వైఎస్సార్ సీపీ శ్రేణుల మధ్య తోపులాట

- పలు చోట్ల ఘర్షణలకు ప్రేరేపించిన టీడీపీ అల్లరి మూకలు
- పోలింగ్ బూత్‌ల్లో తిష్ట వేసి ప్రలోభాలకు యత్నం

కొల్లూరు : పోలింగ్ బూత్‌ల వద్ద టీడీపీ వర్గీయుల కవ్వింపులతో ఘర్షణలు చోటు చేసుకున్న సంఘటనలు కొల్లూరు పరిధిలోని పలుచోట్ల చోటు చేసుకున్నాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఎన్నికలు ప్రారంభమైన దగ్గర నుంచి ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ వర్గాలు గుంపులు గుంపులుగా పోలింగ్ బూత్‌ల వద్ద తిష్టవేసి ఓటర్లను ప్రలోభాలకు గుర చేసేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. టీడీపీ శ్రేణుల దుశ్చర్యలను చూసి ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడంపై ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ శ్రేణులపై ఓ దశలో టీడీపీ వర్గాలు దాడులుకు తెగబడేందుకు ప్రయత్నించడంతో తోపులాటలు, గొడవలు జరిగాయి. మండలంలోని ఈపూరు, కొల్లూరు, దోనేపూడి, అనంతవరం, పోతార్లంక, తిప్పలకట్ట, జువ్వలపాలెం, ఈపూరులంక పోలింగ్ బూత్‌ల వద్ద టీడీపీ మూకల అకృత్యాలను వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆక్షేపించడంతో ఘర్షణలు తలెత్తాయి. కొల్లూరు బాలికోన్నత పాఠశాల పోలింగ్ బూత్‌లో ఎన్నికల కమీషన్ నిర్దేశించిన సమయం 6 గంటలు దాటి టీడీపీ వర్గాలు తీసుకొచ్చిన వృద్ధుడితో ఓటు వేయించే విషయంలో వివాదం తలెత్తింది. ఎన్నికల సిబ్బంది సైతం సమయం మించిపోయాక రావడంతో ఓటు వేయించేందుకు నిరాకరించడంతో టీడీపీ, జనసేన నాయకులు సిబ్బందిపై విరుచుకుపడి సమయానికి ముందే వచ్చాడని వాదనకు దిగారు. అదే సమయంలో వైఎస్సార్ సీపీ ఏజెంట్లు సైతం అభ్యంతరం వ్యక్తం చేయడంతో పోలింగ్ బూత్‌లోకి చొచ్చుకుని వెళ్లిన టీడీపీ, జనసేన నాయకులు వైఎస్సార్ సీపీ ఏజెంట్లతో పాటు, ఎన్నికల సిబ్బందిపై ఘర్షణకు దిగి వృద్ధుడి ఓటు వేయించాల్సిందేనని పట్టుపట్టారు. చివరకు ఎన్నికల అధికారి వృద్ధాప్యం కారణంగా వృద్ధుడితో ఓటు వేసేందుకు అనుమతిస్తున్నట్లు ప్రకటించడంతో వివాదం సద్దుమణిగింది.

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

- ఉదయం నుంచి ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు
- మధ్యాహ్నం వరకు తగ్గని క్యూలైన్
- మండే ఎండలను లెక్కచేయక తరలి వచ్చిన ఓటర్లు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7 గంటలకు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. మధ్యాహ్నం ఒంటిగంటకు కూడా ఓటర్లు ఓటు వేసేందుకు బారులు తీరారు. ఎండను సైతం లెక్క చేయకుండా ఓటు వేసేందుకు యువత నుంచి వృద్ధుల వరకు తరలి వచ్చారు. భట్టిప్రోలు పంచాయతీలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో మధ్యాహ్నం గంటసేపు ఈవీఎంలు మొరాయించింది. సమస్యను వెంటనే పరిష్కరించి పోలింగ్ ప్రక్రియను సజావుగా జరిగే విధంగా అధికారులు స్పందించారు.పెదపులివర్రులో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి దంపతులు, భట్టిప్రోలులో సర్పంచ్ దారా రవి కిరణ్మయి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరుపీధుల ఉదయభాస్కరిలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉరుములు, మెరుపులుతో కూడిన వర్షం కురిసింది. దీంతో మధ్యాహ్నం 2:45 గంటల నుంచి నుంచి గంట పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో పోలింగ్ మందకొడిగా సాగింది. మళ్లీ సాయంత్రం 4 నుంచి పోలింగ్ ఊపందుకుంది. దూర ప్రాంతాల నుంచే కాక దేశంలోని ఇతర రాష్ట్రాలలోని స్థానికులు సైతం ఓటు వేసేందుకు ప్రత్యేకంగా తరలి వచ్చారు. వయో వృద్ధులు సైతం ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు హాజరయ్యారు. మండలంలోని 24 పోలింగ్ స్టేషన్లలో 48 బూత్‌లలో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పలు పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో ఓటర్లు పలు ఇబ్బందులకు గురయ్యారు. కొన్ని చోట్ల టెంట్లు ఏర్పాటు చేయక పోవడంతో ఓటర్లు ఎండలోనే మాడుతూ క్యూలైన్‌లో నిలబడాల్సిన పరిస్థితి నెలకొనప్పటికీ అధికారులు ఇవేమి తమకు పట్టనట్లు వ్యవహరించడం గమనార్హం. భట్టిప్రోలు ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు పర్యవేక్షణలో మొబైల్ స్క్వాడ్, ప్రత్యేక ఆర్మ్‌డ్ పార్టీలు పని చేశాయి. తహసీల్దార్ ఐ. మునిలక్ష్మి ఎన్నికల పరిస్థితిపై ఎప్పటి కప్పుడు అధికారులతో సమీక్షించారు. ఙభట్టిప్రోలు, అద్దేపల్లిలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల తీరును వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ అభ్యర్థి వరికూటి అశోక్ బాబు, ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్‌లు పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఎన్నికల సిబ్బందిని కోరారు.

పిట్టలవానిపాలెం: మండలంలో సార్వత్రిక ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఆయా గ్రామాలలోని ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎండతీవ్రత అధికంగా ఉండడంతో పాటు అక్కడక్కడ ఈవీఎంలు మొరాయించడం వలన మధ్యాహ్నం వరకు పోలింగ్ శాతం మందకొడిగా సాగింది. 2 గంటల తర్వాత పోలింగ్ ఊపందుకుంది. స్థానికంగా ఉంటున్న వారు, దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఓటు హక్కును వినియోగించుకునేందుకు రావడంతో ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. బాపట్ల సర్కిల్ పరిధిలోని పోలీసు సిబ్బందితో పాటు ప్రత్యేక పోలీసు బలగాలు పోలింగ్‌కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

మొరాయించిన ఈవీఎంలు

ఉదయం 7 గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్ ఖాజీపాలెం గ్రామంలోని ఓ పోలింగ్ కేంద్రంలో ఉదయం 8 గంటలకు ప్రారంభమైంది. దీంతో పాటు కొన్ని గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలలో పలు చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో గంట నుంచి రెండు గంటలకు పైగా పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది.


భట్టిప్రోలులో పోలింగ్ సరళిపై చర్చిస్తున్న నందిగం సురేష్, వరికూటి అశోక్‌బాబు



భట్టిప్రోలులో ఓటు వేయించేందుకు వృద్ధురాలిని వీల్‌చైర్‌లో తీసుకువెళుతున్న సిబ్బంది

ఓటు వేసిన పండుటాకులు

పిట్టలవానిపాలెం: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొన్ని గ్రామాలలో ఈ ఏడాది ఓటు హక్కును నూతనంగా వచ్చిన యువకులు, వయోవృద్ధులు, అంగవైకల్యం కలిగిన వారు సైతం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంతెనవారిపాలెం, పిట్టలవానిపాలెం, భవనంవారిపాలెం , పిట్టువానిపాలెం, అలకాపురం గ్రామాలలో సుమారు 90 ఏళ్ళు పైబడిన వృద్ధులు ఎండని సైతం లెక్కచేయక ఓటు హక్కును వినియోగించుకునేందుకు సహాయకుల ద్వారా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అకాల వర్షం..

భట్టిప్రోలు: వాతావరణంలో నెలకొన్న అనూహ్య మార్పుతో సోమవారం భట్టిప్రోలు మండలంలో వర్షం కురిసింది. దీంతో కృష్ణానదీ పరివాహక లంక గ్రామాల్లోని వాణిజ్య పంట ఆరబోసిన పసుపు కల్లాల్లో వర్షానికి తడిచింది. అలాగే మొక్కజొన్న కూడా వర్షానికి తడిచిపోయింది. ఎండల వేడిమికి, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజానీకానికి వాతావరణంలో నెలకొన్న మార్పు ఊరటనిచ్చింది. మధ్యాహ్నం భట్టిప్రోలు మండలంలోని అన్ని గ్రామాలలో ఈదురు గాలులు వీచాయి. ఆకాశం మేఘావృతమై చల్లదనాన్ని గుమ్మరిస్తూ ఈదురు గాలులు వీచాయి. గాలులతో ప్రజానీకం సేద తీరారు. తీవ్ర ఎండలు, వడగాల్పులతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలకు వాతావరణ మార్పుతో చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు. రైతులు పంట దిగుబడులను కాపాడుకునేందుకు పట్టాలు కప్పి తడవకుండా జాగ్రత్తలు పడుతున్నారు.

కొల్లూరులో రాత్రి వరకు కొనసాగిన ఓటింగ్


దోనేపూడి పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు అభివాదం చేస్తున్న అశోక్‌బాబు

కొల్లూరు : ఈవీఎంల మొరాయింపు.. ఎన్నికల సిబ్బంది పోలింగ్ నిర్వహణలో జాప్యం కారణంగా కొల్లూరు మండలంలో ఓటింగ్ ప్రక్రియ రాత్రి వరకు కొనసాగుతూనే ఉంది. సోమవారం సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎన్నికల నిర్వహణ అధికారులు తొలుత ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించే సమయంలో సక్రమంగానే పని చేసిన ఈవీఎంలు అసలు ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యే సమయానికి సాంకేతిక సమస్యలు రావడంతో పలు పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ సమయం జాప్యమైంది. మండలంలోని పెసర్లంక, ఈపూరు, దోనేపూడి తదితర గ్రామాలలో ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు బారులు తీరి ఎండల్లో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు పోలింగ్ బూత్‌లు ఇరుకు సందులు, ఇరుకైన గదుల్లో ఏర్పాటు చేయడంతో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి తలెత్తింది. దీనికి తోడు మధ్యహ్నం అకస్మాత్తుగా మండలంలోని పలు గ్రామాలలో భారీ వర్షం కురవడంతో ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరిన ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈపూరు సచివాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ చీకటి మయంగా ఉండటంతో ఓటర్లు గుర్తులు కానరాక అవస్థలు పడ్డారు. దోనేపూడి పాఠశాలలో 1200కు పైబడి ఓటర్లున్న ఓ పోలింగ్ బూత్‌ను ఇరుకు సందులో ఏర్పాటు చేసి మహిళలు, పురుషులకు ఒకే మార్గం ఏర్పాటు చేయడంతో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. అదే తరహాలో కొల్లూరు ఎస్సీ ఏరియాలోని పోలింగ్ బూత్ సైతం ఇరుకు మయంగా ఉండటంతో ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకునేందుకు రాత్రి వరకు వేచి ఉండాల్సి వచ్చింది. మండలంలోని రావికంపాడు, కిష్కిందపాలెం, దోనేపూడితోపాటు మరికొన్ని బూత్‌ల్లో రాత్రి వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది.